# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్ 26.06.2025 | 24 క్యారెట్లు 1,00.750 | కిలో వెండి 1,20,000 | 26 °C | సంపుటి:3 | సంచిక:179

www.vishalabharati.com


## బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం



- తెలంగాణలో పండుగ వాతావరణం
- బోనాల ఉత్సవాలు ప్రారంభం
- తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు

**స్టేట్ బ్యూరో, విశాలభారతి:**

బోనాల ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలతో తెలంగాణలో పండుగ వాతావరణం మొదలవుతుందని అన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాఢ మాసం తొలి బోనం

మిగతా 2లో

# తెలంగాణలో బోనాల సంబురం

## ఆషాఢ బోనాలు 2025



- బోనాలు మొదలయ్యే తేదీలివే
- మరింత ఘనంగా ఈ ఏడాది బోనాలు
- ప్రతి ఆదివారం, గురువారం మొత్తం 9 రకాల పూజలు
- గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారికి మొదటి బోనం
- జూలై 24న తొమ్మిదో బోనం

**విశాలభారతి ప్రత్యేకం:**

తెలంగాణలో ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు బోనాల పండుగ సందడి మొదలవుతుంది. పల్లె, పట్నం అని తేడా లేకుండా ఆషాఢ బోనాలు వేడుకగా జరుగుతాయి. పండుగ రోజున గ్రామ దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, పోతరాజు వేషాలు, శివసత్తులు, డప్పుల చప్పుళ్లు వంటివి ఎటు చూసిన కనిపిస్తాయి. అసలు ఈ బోనాలు అనే మాట ఎత్తగానే మొదట గుర్తొచ్చేది మాత్రం పురాతన చరిత్ర కలిగిన హైదరాబాద్ బోనాలే. ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ బోనాలు ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆషాఢ మాసం ప్రారంభం కాగానే ప్రతి ఆదివారం, గురువారం మొత్తం 9 రకాల పూజలను అమ్మవారు అందుకుంటారు. బోనాలు సందర్భంగా జూన్ 26వ తేదీ గురువారం చారిత్రక గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక అమ్మవారికి మొదటి బోనం సమర్పించడంతో ఈ బోనాలు పండుగ సంబురాలు ప్రారంభమవుతాయి. ఇది మొదటి బోనం. అనంతరం జూన్ 29వ తేదీన రెండో బోనం, జూలై 3న మూడో బోనం, జూలై 6న నాలుగో బోనం, జూలై 10న ఐదో బోనం, జూలై 13న

మిగతా 2లో



## 3 నెలల్లో సర్పంచ్ ఎన్నికలు

- స్థానిక సంస్థల ఎన్నికలపై ధ తీర్పును వెలువరించిన హైకోర్టు
- 3 నెలల్లో నిర్వహించాలని ఆదేశాలు జారీ
- 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలి
- 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసింది
- ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం
- పంచాయతీల బాధ్యతలను స్పెషల్? అధికారులకు అప్పగించిన ప్రభుత్వం

2

## కో లివింగ్ కల్చర్‌పై వీహెచ్ ఆగ్రహం!



- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీహెచ్ సంచలన వ్యాఖ్యలు
- భర్తలను భార్య.. తల్లినీ.. బిడ్డ చంపడం చూస్తుంటే బాధగా ఉంది
- ఒకప్పుడు ఫ్యాక్షన్ మర్డర్స్ జరిగేవి
- ఇప్పుడు లవ్ మర్డర్స్ జరుగుతున్నాయి
- మానవ సంబంధాలకు ఏమైతుంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుత రోజుల్లో సమాజంలో జరుగుతున్న దారుణాల పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమంత రావు మాట్లాడుతూ.. సమాజంలో భర్తలను భార్య.. తల్లినీ.. బిడ్డ చంపడం చూస్తుంటే బాధ ఐతుందన్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ మర్డర్స్ జరిగేవి. ఇప్పుడు లవ్ మర్డర్స్

మిగతా 2లో



## బనకచర్లకు బీఆర్ఎస్ పాలనలో అంకురార్పణ

- బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆపడానికి చర్యలు
- నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- తెలంగాణ వాదన బలంగా వినిపించాలి
- ప్రాజెక్టుపై ఈ నెల 30న పవర్ పాయింట్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆపడానికి తెలంగాణ ప్రభుత్వం చట్టపరమైన చర్యలతో ముందుకు సాగుతుందని రాష్టర్ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జలసౌధలో ఉన్నత నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బనకచర్ల ప్రాజెక్టు చట్టవిరుద్ధమైనదని, రాష్ట్ర ప్రయోజనాలకు హానికరం అని అన్నారు. ఈ ప్రాజెక్టును సవాల్ చేయడానికి, తెలంగాణ వాదన బలంగా వినిపించేందుకు చట్టపరమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. తెలంగాణ నీటిపారుదల పనుల కోసం ఆర్మీ టన్నెల్ నిపుణులను నియమించనున్నామని చెప్పారు. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ సమీక్షా సమావేశం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ ప్రాజెక్ట్ విషయంలో ఈ నెల 18వ తేదీనే అఖిలపక్ష పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా మరోసారి పీపీటీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకుగోదావరి -బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ తాజాగా వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తాజా పరిణామాలతో

మిగతా 2లో

## అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా

- కెనడీ స్పేస్ సెంటర్ నుంచి అంతరిక్ష ప్రయోగం సక్సెస్
- స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా మరో ముగ్గురితో కలసి ప్రయాణం



2

## కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు



- రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు
- తెలంగాణ వచ్చింది కాబట్టే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు
- ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ చేసిన మోసం

**విశాలభారతి: స్టేట్ బ్యూరో:**

కేసీఆర్ దమ్మెంతా అన్నది ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు కాబట్టే తెలంగాణ వచ్చింది అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. తెలంగాణ వచ్చింది కాబట్టే ఇవాళ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి

మిగతా 2లో



## తాళాలు లేని ద్విచక్ర వాహనాలే టార్గెట్

- చోరీలకు పాల్పడుతున్న ధ 4గురు సభ్యుల ముఠా అరెస్టు
- నిందితుల నుంచి రూ.30 లక్షల విలువచేసే 15 బైక్ లు స్వాధీనం
- మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ ఉదయ్ కుమార్

3

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
26.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన సీఎం

మొదటి పేజీ తరువాయి



సమర్పించడంతో జంటనగరాల్లో బోనాల సందడి నెలకొంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించే దిశగా అమ్మవారి దీవెనలు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు భక్తుల సదుపాయాల కోసం రూ.20 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

# బనకచర్లకు బీఆర్ఎస్ పాలనలో అంకురార్పణ

మొదటి పేజీ తరువాయి

పాటు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రులతో సంప్రదింపులు, చేస్తున్న పోరాటం వివరాలను ఈ పీపీటీలో వివరించనున్నారు. ముఖ్యంగా గత బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాజెక్ట్ కు ఎలా అంకురార్పణ జరిగిందో స్పష్టమైన డాక్యుమెంట్ల ఆధారాలు చూపడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రస్తుత చర్య వెనుక ఉన్న రాజకీయ నేపథ్యాన్ని బహిర్గతం చేసేలా ఈ పీపీటీ ఉండనందని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఎన్డీఎస్ఏ సిఫార్సుల అమల్లో ఆలస్యం తగదని కేంద్ర జలసంఘం మార్గదర్శకాల మేరకు మరమ్మతులు చేయాలని పనుల పురోగతి నివేదికలను వారానికోసారి అందించాలని అధికారులను ఆదేశించారు. సింగూర్ కెనాల్‌తో సహా ఇతర ప్రధాన పనుల స్థితిని కూడా ఈ సందర్భంగా మంత్రి సమీక్షించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టుపై ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలతో సహా అనేక ఏజెన్సీల నుండి ప్రతిపాదనలు కోరినట్లు అధికారులు మంత్రికి తెలియజేశారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు అదనపు మానవశక్తి నియమించాలని లైడార్ సర్వే నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలపై తక్షణ చర్య తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పదోన్నతులు, బదిలీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేస్తామని మంత్రి అధికారులకు హామీ ఇచ్చారు.



# అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఆక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా దూసుకె ళ్లారు. దీంతో అతను మరో చరిత్ర సృష్టించారు. శుభాన్షు కక్ష్యకు చేరుకున్న రెండవ భారతీయుడు , అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంకి ప్రయాణించిన మొదటి భారతీయుడు అయ్యారు. ఈ ప్రయోగం బుధవారం ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక ద్వారా జరిగింది. ఆక్సియం-4 మిషన్ ఒక ప్రైవేట్ అంతరిక్ష విమాన వెంచర్. శుక్లాతో పాటు మరో ముగ్గురు అంతర్జాతీయ వ్యోమగాములు అంతరిక్షంలో చేరారు.శుభాన్షు అంతరిక్షయాత్ర భారతదేశ అంతరిక్ష కార్యక్రమంలో ఓ ముఖ్యమైన ఘట్టం. 41 సంవత్సరాల తర్వాత ఒ భారతీయుడు అంతరిక్షంలోకి ప్రయాణించడం ఇదే మొదటిసారి. 1984లో భారత వైమానిక దళ అధికారి, స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. కజకిస్తాన్ నుంచి సోవియెట్ అంతరిక్ష నౌకలో సోయెజ్ -టి-11 అంతరిక్ష నౌకద్వారా అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భారతీయుడు అయ్యాడు. నాలుగు దశాబ్దాల తర్వాత మరో అద్భుతం ఇది.శుభాన్షు శుక్లా కక్ష్యలోకి దూసుకెళ్లడం ద్వారా భారత అంతరిక్షచరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం( ఐఎస్ ఎస్ ) ప్రయోగాలు చేస్తున్న మొదటి భారతీయపౌరుడిగా రికార్డులకు ఎక్కాడు, రాకేశ్ శర్మ చారిత్రాత్మక అంతరిక్షయాత్ర జరిగిన తర్వాత ఒక సంవత్సరానికి 1985లో జన్మించిన శుక్లా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కెప్టెన్, ప్రస్తుతం వ్యోమగామి. ఆక్సియమ్ స్పేస్ యాక్స్ -4 మిషన్లో భాగంగా ఎ÷-లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి స్పేస్ ఎక్స్ డ్రాగన్ అంతరిక్షనౌకను ప్రయోగించారు. బుధవారం ఫాల్కన్ -9 లోని మెర్లిన్ ఇంజన్లు నిప్పులు చిమ్ముకుంటూ స్పేస్ ఎక్స్డ్రాగన్ ను ఎర్త్ ఆర్బిట్ లోకి తీసుకెళ్లింది. నిర్దేశిరచిన ఖచ్చితత్వంతో ఫాల్కన్-9 డ్రాగన్ ను కక్ష్యలో ప్రవేశపెట్టింది. రెండోదశలో డ్రాగన్ మరింత ముందుకు దూసుకెళ్లి అంతరిక్ష ప్రయోగశాల వైపు సాగింది. ప్రయోగం ప్రారంభం కావడానికి ఓ గంటముందు శుక్లా, ఇతర వ్యోమగాములు తమతమ కుటుంబ సభ్యులకు వీడ్కోలు పలికారు. శుక్లా భార్య,పిల్లలు కూడా శుభాకాంక్షలు చెప్పారు. విఘ్నాలతో ఆలస్యమైన అంతరిక్ష ప్రయాణం కొన్ని విఘ్నాల కారణంగా మే 28నే జరగాల్సిన ఈ ప్రయోగం ఆలస్యం అయింది. సాంకేతిక లోపాలు,ఫాల్కన్ -9, డ్రాగన్ అంతరిక్ష నౌక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వాతావరణ పరిస్థితులు, ఇలా ఎన్నో కారణాల వల్ల జాప్యం జరిగింది. నలుగురు వ్యోమగాములు దాదాపు నెల్లాళ్లపాటు నిర్బంధంలో ఉండాల్సివచ్చింది. స్పేస్ ఎక్స్, ఆక్సియమ్, నాసా, ఇస్రో నిపుణులు లోపలన్నింటినీ విజయవంతంగా చక్కదిద్దారు. ఎట్టకేలకు బుధవారంనాడు విజయవంతంగా ప్రయోగం జరిగింది. అంతరిక్ష ప్రయాణంలో విఘ్నాలు ఓ భాగం, మిషన్ ఆలస్యం అయినా యాక్స్-4 సిబ్బంది ఉత్సాహంగా అంతరిక్ష కేంద్రానికి సురక్షితమైన,విజయవంతమైన ప్రయాణంకోసం ఎదురు చూశారని మిషన్ కమాండర్ పెగ్గి విట్సన్ తెలిపారు.ఎఎక్స్ ? సిబ్బందితో డ్రాగన్ అంతరిక్ష నౌక ప్రస్తుతం భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కలిసేందుకు నిర్దేశిరచిన భూ కక్ష్యలో తిరుగుతోంది.మిశన్ పైలట్ అయిన శుక్లా అంతరిక్ష కేంద్రానికి సాగుతున్న ప్రయాణాన్ని పరిశీలిస్తారు. గతంలో మిగ్ -21, మిగ్ -29, డోర్నియర్, ఎఎన్- 32, సుఖోయ్ -30వంటి పలు విమానాల టెస్ట్ పైలెట్ అయిన శుక్లా డ్రాగాన్ అంతరిక్ష నౌక పైలట్ గా కీలకపాత్ర వహిస్తున్నారు. భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాను ఆయన అంతరిక్ష సహచరులు షుక్స్ అని వ్యవహరిస్తారు.శుక్లాతో పాటు ఎఎక్స్- 4 మిషన్ కు నాయకత్వం వహిస్తున్న అమెరికన్ వ్యోమగామి డాక్టర్ పెగ్గీ విట్సన్.అంతరిక్షంలో 675 రోజులు గడిపిన అనుభవజ్ఞుడు ఉన్నారు. మిగతా ఇద్దరు మిశన్ నిపుణులు పోలెండ్ కు చెందిన సవోస్జ ఉజ్నాన్స్కి, హంగేరికి చెందిన డిబోర్ కాపు. డ్రాగన్ మిషన్లు 1,000 కంటే ఎక్కువ సైన్స్, పరిశోధన ప్రాజెక్టులను ప్రారంభించాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాన్షు శుక్లా భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించిన ఏడు అత్యాధునిక ప్రయోగాలను నిర్వహిస్తారు. సుక్ష్మ గురుత్వాకర్షణ( మైక్రో గ్రావిటీలో) జీవశాస్త్రం, ఆహారం, వైద్యం, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగాలు నిర్వహిస్తారు.

# పీయూలో పైసలిస్తేనే భోజనం!



**మహబూబ్‌నగర్ కలెక్టరేట్:** పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. వేసవి సెలవులు ముగిశాక పీయూలో ఈనెల 16 నుంచి తరగతులు ప్రారంభమైనా అధికారులు ఇప్పటి వరకు వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ-గద్వాల, నారాయణపేట, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా పీయూలో చదువుతున్నారు. వసతి గృహాల్లో సరుకులు నిండుకోవడం.. డిపాజిట్ చెల్లిస్తే సరైనా భోజనం అంటూ అధికారులు అంటుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

# తెలంగాణలో బోనాల సంబురం

మొదటి పేజీ తరువాయి

ఆరో బోనం, జూలై 17న ఏడో బోనం, జూలై 20న 8వ బోనం, జూలై 24న తొమ్మిదో బోనంతో ఈ బోనాలు సంబురాలు ముగుస్తాయి.

బోనం అంటే భోజనం అని అర్థమట. భోజనం అనే పదానికి వికృతి రూపమే ఈ బోనమ్ లేదా బోనం. ఈ పండుగ సందర్భంగా కొత్త మట్టి కుండల్లో మహిళలు బోనం (వరి అన్నం) వండుతారు. అంటే తల్లిదండ్రులు కూతురు ఇంటికి వచ్చినప్పుడు ప్రేమగా భోజనం పెట్టినట్లు, ఆషాఢ మాసంలో పుట్టింటికి వచ్చే అమ్మవారికి భక్తులు ప్రేమతో సమర్పించే నైవేద్యం అని అర్థం. గ్రామ దేవతలను పూజించే సంప్రదాయం ఈ పండుగ సందర్భంగా కనిపిస్తుంది. సాధారణంగా మనం గమనిస్తే.. ప్రతి ఊరుకి ఒక రక్షక దేవత ఉంటుంది. ఎల్లమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, పోశమ్మ, అంకమ్మ, మైసమ్మ, దుర్గమ్మ, అంకాలమ్మ, నూకాలమ్మ, మావురమ్మ, సారమ్మ ఇలా ఆయా ప్రాంతతాలను బట్టి వారి గ్రామ దేవతలకు జాతరలు చేయడం మనం గమనిస్తూ ఉంటాం. తెలంగాణలో బోనాల పండుగ కేవలం ఆషాఢ మాసంకే పరిమితం కాలేదు. పలు సందర్భాల్లో వేర్వేరు రకాల బోనాల నిర్వహణ ఇక్కడ కనిపిస్తుంది. కుండలో బోనం వండి దేవతలకు నైవేద్యం పెట్టే సంప్రదాయం ఉంది. పంటలు బాగా పండాలని, ఆరోగ్యాలు బాగుండాలని ప్రకృతికి తెలిపే ఒక రకమైన కృతజ్ఞతాభావం. ఈ బోనాలు పండుగలో మహిళలదే



కీలక పాత్ర. ఈ పండుగలోని ఆచార, సంప్రదాయాలు మహిళ కేంద్రంగా ఉంటాయి. వర్షాకాలం ప్రారంభంలో వచ్చే వ్యాధులను అరికట్టేలా కొన్ని ఆరోగ్య సూత్రాలు కూడా ఈ పండుగలో దాగి ఉన్నాయనేది జానపద చరిత్రకారుల అభిప్రాయం.

ఈ పండుగ సందర్భంగా బోనాలను కుండలో వండుతారు. కుండ స్త్రీ గర్భానికి సంకేతం. పూర్వ కాలంలో గర్భస్థ శిశువులు, చిన్న పిల్లల మరణాలు బాగా అధికంగా ఉండేవి. ఈ నేపథ్యంలో రుతు మార్పిడి కాలంలో ప్రబలే అంటువ్యాధులు, జబ్బుల నుంచి పిల్లలను, కుటుంబాలను, గ్రామాలను కాపాడాలని గ్రామ దేవతలను వేడుకుంటూ బోనాలు నిర్వహించేవారు. ఈ బోనాల్లో వాడే వేప ఆకులు, పసుపు సూక్ష్మక్రిముల నాశినిగా పనిచేస్తాయి. ఈ బోనాల పండగకు హైదరాబాద్ నగరం ప్రతీకగా మారింది. ఈ హైదరాబాద్ ఆషాఢ మాస బోనాల వెనుక శతాబ్దాల చరిత్ర ఉంది. 1813 ఆ ప్రాంతంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ప్లేగు వ్యాధి సోకి విపరీతంగా మరణాలు సంభవించాయట. ఆ సమయంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో విధుల నిర్వహణకు వెళ్లిన హైదరాబాద్ సైనిక దళం ఉజ్జయినిలోని మహంకాళిని ప్రార్థించిందట. అక్కడి నుంచి తిరిగొచ్చాక ఉజ్జయిని దేవత విగ్రహాన్ని ఏర్పాటు చేసి బోనాలు సమర్పించడంతో.. ప్లేగు వ్యాధి తగ్గిపోయిందని భక్తులు ఇప్పటికీ నమ్ముతారు. మహిళలు మట్టి లేదా ఇత్తడి పాత్రలో పాలు, బెల్లంతో బోనం (వరి అన్నం) వండుతారు. ఈ పాత్రలను వేప ఆకులు, పసుపుతో అలంకరిస్తారు. ఆ తర్వాత ఈ పాత్రలను తలపై మోసుకెళ్లి ఆలయం వద్ద ఉన్న అమ్మవారికి గాజులు, చీరలతో సహా బోనం సమర్పిస్తారు. ఒకప్పుడు సికింద్రాబాద్ ప్రాంతం బ్రిటీష్ సైనిక స్థావరంగా ఉండేది. ఈ ప్రాంతాన్ని లష్కర్ అని పిలిచేవారు. దీంతో అక్కడ ఇప్పటికీ లష్కర్ బోనాలు అనే మాట వినిపిస్తూ ఉంటుంది. అయితే.. ఆషాఢ మాసం మొదటి ఆదివారం గోల్కొండ కోటలో బోనాలు పండుగ ప్రారంభమై.. లాల్ దర్వాజ సింహ వాహిని బోనాలతో ఈ బోనాలు ఉత్సవం ముగుస్తుంది.

# కేసీఆర్ దమ్మెంటో ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీకి తెలుసు

మొదటి పేజీ తరువాయి

అయ్యారు. అది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడడం బాధాకరం అని కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్ధాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం.. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంతకం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.




# కో లివింగ్ కల్చర్‌పై వీహెచ్ ఆగ్రహం!

మొదటి పేజీ తరువాయి


జరుగుతున్నాయని తెలిపారు. అబ్బాయి, కానీ అమ్మాయి కానీ మీకు నచ్చకపోతే పెళ్లి చేసుకోకండి.. మీకు నచ్చిన వారినే చేసుకోండని సూచించారు. సమాజం ఎక్కడికి పోతుంది..? యమధర్మ రాజుతో కూడా భర్త కోసం కొట్లాడిన భార్యలను చూశానని అన్నారు. కానీ ఇప్పుడు జరుగుతున్న హత్యలు చూస్తుంటే మానవ సంబంధాలకు ఏమైతుంది అని అనిపిస్తుందన్నారు. పాత రోజులే బాగున్నె అనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఇలాంటి ఘటనలు ఎక్కువ ప్రచారం చేస్తున్నారు. దీన్ని హీరోయిజం అనుకుంటున్నారని వాపోయారు. సాఫ్ట్‌వేర్లు కో లివింగ్ పేరిట అడ్డదార్లు తొక్కుతున్నారు. మంత్రి శ్రీధర్ బాబు దీనిపై ఆలోచన చేయాలి.. ఇలాంటి వాటిని అరికట్టాలని కోరారు. అమ్మాయి.. అబ్బాయి ఒకే రూమ్ లో ఉండే విధానం బాగాలేదు. ప్రభుత్వం ఆలోచన చేయాలి.. లేదంటే ఇలాంటి హత్యలు జరుగుతూనే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సీఎం రేవంత్.. షీ టీం తో చర్చలు జరపాలని కోరారు. సమాజంలో ఉన్న విద్యావేత్తలు.. డాక్టర్ లు.. ఆలోచన చేసి దారుణాలను అరికట్టడానికి తమవంతు కృషి చేయాలని కోరారు. గద్వాలలో ఐశ్వర్య అనే యువతి తేజేశ్వర్ ను పెళ్లి చేసుకుని ప్రియుడి సాయంతో భర్తను కాటికి పంపిన విషయం తెలిసిందే. పెళ్లైన నెల రోజులకే దారుణానికి ఒడికట్టింది. అంతకు ముందు ఇండోర్ కు చెందిన రాజా రఘువంశీని ఇష్టం లేని పెళ్లి చేసుకున్న సోనమ్ హనీమూన్ కోసమని మేఘాలయకు తీసుకెళ్లి ప్రియుడితో కలిసి కిరాయి హంతకులతో చంపేసింది. ఇక నిన్న జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పదో తరగతి బాలిక తన ప్రియుడితో ప్రేమ పెళ్లికి ఒప్పుకోవడం లేదని తల్లిపై కక్షగట్టి ప్రియుడి సాయంతో దారుణంగా హతమార్చింది. రోజుల వ్యవధిలోనే వరుస ఘోరాలు జరుగుతుండడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# 3 నెలల్లో సర్పంచ్ ఎన్నికలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన తుది తీర్పును న్యాయస్థానం వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించింది. 2024 జనవరి 31వ తేదీన సర్పంచుల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. గడువు ముగిసి ఒకటిన్నరేళ్లయినా ఎన్నికలు నిర్వహించకపోవడంపై న్యాయస్థానంలో 6 పిటిషన్లు దాఖలు అయ్యాయి. సర్పంచ్?ల పరిపాలన లేక గ్రామాల అభివృద్ధి వెనుకబడుతోందని బీఆర్?ఎస్?, బీజేపీలు ఆరోపిస్తున్న విషయం విదితమే. గ్రామ పంచాయతీ ఎన్నికలపై తీర్పును జస్టిస్ టి.మాధవిదేవి వెలువరించారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసినా ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను స్పెషల్? అధికారులకు అప్పగించడం, రాజ్యాంగానికి, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం అని పేర్కొన్నారు.

ప్రత్యేక అధికారులు వారికున్న ఇతర విధుల్లో



ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని, రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు తమ సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారని న్యాయస్థానానికి తెలిపారు. ప్రస్తుతం ఆ నిధులు అందక నానా అవస్థలు పడుతున్నారని, వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియను చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి కనీసం మరో నెల రోజుల సమయం అవసరమని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి కూడా ఎందుకు మీరు అమలు చేయలేదని ప్రశ్నించారు.

ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపిన అనంతరం ప్రక్రియ పూర్తి చేయడానికి మరో రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్టేట్? ఎలక్షన్? కమీషన్? చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. దీనికి న్యాయవాది సమాధానమిస్తూ రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి వచ్చే మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని తీర్పును వెలువరించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

గురువారం
26.06.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily

GENERAL NEWS



## వానలు రావాలని కప్పతల్లికి పూజలు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం రామరాజు పల్లి గ్రామంలో ని రైతులు వర్షాలు పడక ఆరుతడి పంటలు ఎకరాల కొద్ది పత్తి విత్తనాలు సాగు చేసినారు. ఆ యొక్క విత్తనాలు నాటిన రైతులు వర్షాలు పడక మొలకత్తక పోవటం మరియు నారు పోయడానికి భయపడున్న రైతులు వర్షాలు లేకపోవడం వలన రైతులంతా కలిసి వర్షాలు రావాలని చిన్న పెద్ద తేడా లేకుండా మహిళలందరూ పెద్ద ఎత్తున వారి బాధను కప్పతల్లికి పూజలు చేస్తే వర్షాలు పడతాయి అన్న ఆశతో మొదట కొబ్బరికాయ కొట్టి ఒక చల్లటి బట్టతో కప్పను బంధించి బిందెలో ఉంచి ఆ కప్పను అమర్చి వేపాకులతో అలంకరణ చేసి వానమ్మ వానమ్మ అంటూ కోలాటపాటలతో ప్రతి ఇంటికి ఒక బిందె చొప్పున నీళ్లు ఆ కప్పతల్లికి పోసి వర్షాలు రావాలని మొక్కుకున్నారు.



# బైకు చోరీకేసులో నిందితునికి జైలు శిక్ష

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితునికి 18 నెలలు జైలు శిక్షతో పాటు , రూ. 5 వేలు జరిమాన విధిస్తూ ఇబ్రహీంపట్నం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. తుర్కయంజాల్ లోని రెస్టారెంట్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని రమావత్ జయంత్ (21) దొంగతనం చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఆదిభట్ల పోలీసులు గాలింపు చర్యలు ముమ్మారం చేసి రమావత్ జయంత్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. నిందితునిపై ఇబ్రహీంపట్నం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు విచారణ జరిపి పబ్లిక్ ప్రాసిక్యూషన్ విజయ వాదనలతో ఏకీభవిస్తూ నిందితునికి 18 నెలల జైలు శిక్ష తోపాటుగా , రూ. 5 వేలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు ఎస్ఐ , కోర్ట్ కానిస్టేబుల్ సహకరించారు.

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



పెద్దఅంబర్ పేట్, విశాలభారతి: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కేంద్రంలో గతంలో నేను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప.. గత పది సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కార్ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని లష్కర్ గూడ, ఇనాం గూడ, అబ్దుల్లాపూర్మెట్, కవాడిపల్లి బండ రావిరియాల, చిన్నరావిరియాల, బాటసింగారం, జాఫర్ గూడ గ్రామాలలో సుమారు కోటి నలభై మూడు లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు కమ్యూనిటీ హాళ్లకు అధికారులు నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని.. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఇదే మండలంలో సుమారు 25 గ్రామపంచాయతీలకు నిర్మల్ పురస్కార్ అవార్డు లభించింది అని అన్నారు. గ్రామంలో పూర్తిస్థాయి అభి వృద్ధి జరిగినప్పుడే ఈ నిర్మల్ పురస్కార్ అవార్డు లభిస్తుందని అన్నారు. దేశ చరిత్రలో రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేనివిధంగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలలో వేసి రికార్డు సృష్టించామని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత ఆశాజనకంగా లేకున్నా.. రైతుల సంక్షేమం కోసం ఎక్కడ వెనకడుగు వేయకుండా పంట పెట్టుబడి సహాయాన్ని అందించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గత బి ఆర్ ఎస్ హయాంలో రైతుబంధు సహాయాన్ని పూర్తి చేయడానికి నెలలు తరబడి సమయం తీసుకున్నారని.. దీంతో సరైన సమయంలో పంట పెట్టుబడి అందక రైతులు అప్పుల పాలయ్యారని... కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా నిదులు విడుదల చేసి రైతుల కు అండగా నిలిచిందన్నారు. రైతు భరోసా నిధులు దుర్వినియోగం చేసుకోకుండా పంట పెట్టుబడికి ఉపయోగించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధు సూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ ఎం పిపి బుర్ర రేఖా మహేందర్ గౌడ్, మాజీ కోఆప్షన్ మెం బర్ గౌస్ పాషా, ఎంపీటీసీ కేశెట్టి వెంకటేష్, రైతు సహ కార సంఘం డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ కొలను శ్రీధర్ రెడ్డి, పిగిలిపూర్ మాజీ సర్ప ంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పం చులు,ఎంపిటిసిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బావిలో నుంచి చిన్నారి మృతదేహం వెలికితీత

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

పోలీసులు బావిలో పడిన చిన్నారి మృతదేహాన్ని వెలికి తీశారు. మైలార్దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ సమీపంలో ఆర్ జి కే వద్ద మంగళవారం ఉదయం చంద్రకుమార్ కొడుకు ఐదేళ్ల చిన్నారి ప్రిన్స్ కుమార్ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడిన విషయం తెలిసిందే. ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో డిఆర్ ఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో అతి కష్టం మీద బుధవారం ఉదయం చిన్నారి మృతదేహాన్ని వెలికి తీశారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తాళాలు లేని ద్విచక్ర వాహనాలే టార్గెట్



### చోరీలకు పాల్పడుతున్న 4గురు సభ్యుల ముఠా అరెస్టు

### నిందితుల నుంచి రూ.30 లక్షల విలువచేసే 15 బైక్ లు స్వాధీనం

### మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ ఉదయ్ కుమార్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను మియాపూర్ పోలీసులు రట్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ ఉదయ్ కుమార్ మియాపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. చదువు మానేసి మద్యానికి బానిసగా మారిన నలుగురు శ్రీకాంత్, కుంభ వెంకటేశ్వర్లు,నల్లగొండ వేణు, ఎరువా గంగాధర్ లు చోరీల బాట పట్టారు. ఆయా కాలనీలో హ్యాండిల్ లాక్ లేని ద్విచక్ర వాహనాలే వీళ్ళ టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను పక్కా రాష్ట్రం ఆంధ్రా ప్రదేశ్ కు తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. అదేవిధంగా వాహనాల విడిభాగాలను కుడా అమ్ముతున్నారు. నిందితులపై కమిషనరేట్ పరిధిలోని బేగంపేట్,కేపిఎచ్ బీ,చందానగర్, మాదాపూర్, మియాపూర్ పోలీస్ స్టేషన్ లలో పలు కేసులు నమోదు అయ్యాయి. రూ. 30 లక్షల విలువైన 15 బైక్ లను స్వాధీనం చేసుకొని 4 గురు నిందితులను రిమాండ్ కు తరలించినట్లు డీసీపీ తెలిపారు.



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**హైదరాబాద్, విశాలభారతి:**

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, హైదరాబాద్ జిల్లా శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కార వారోత్సవాలలో భాగంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీ విక్రమ్ కుమార్, కార్యదర్శి శ్రీ కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీ కె.ఆర్. రాజ్ కుమార్ లతో పాటు సభ్యులు ఖలేద్ అహ్మద్, ముఖీమ్ ఖురేషి, ఎ.వి. శ్రీధర్ తదితరులు మొదటగా ప్రభుత్వ సిటీ కళాశాలను సందర్శించి, అక్కడ ఉద్యోగులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెట్లబురుజులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి కి వెళ్లి, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి, వారి ఇబ్బందులను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ దంత వైద్య కళాశాల మరియు ఉస్మానియా జనరల్ ఆసుపత్రి లను సందర్శించి, అన్ని యూనిట్లలో ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా, ఉద్యోగుల నుండి అందిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సైని (ముజీబ్) చొరవతో తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి సమర్పించిన 58 ప్రధాన ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారానికి జరుగుతున్న కృషి గురించి ఉద్యోగులకు వివరించారు. ముఖ్యంగా, ఆర్థికేతర సమస్యలు చాలా వరకు పరిష్కారం అయ్యాయని ఉద్యోగులకు తెలియజేశారు. కార్యక్రమములో రహీం, రాజు, రాజ్ కుమార్, రామ్ కుమార్, శ్రీనివాస్, సంతోష్, రాజు, కళ్యాణ్, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



## దేవరుప్పుల మండల జిఎంపిఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం కామరెడ్డిగూడెంలోని బీరప్ప ఆలయ ఆవరణంలో భూమాండ్ల కుమార్ అధ్యక్షతన జరిగిన జిఎంపిఎస్ కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు మోటి దేవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గొల్ల కురుమలకు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేయాలి అన్నారు. అనంతరం మండలం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది దేవరుప్పుల మండలం జిఎంపిఎస్ అధ్యక్షులుగా భూమండ్ల కుమార్ ,ప్రధాన కార్యదర్శిగా జక్కుల గంగరాజు, ఉపాధ్యక్షులుగా వర్రే ఎర్రయ్య,కార్యవర్గ సభ్యులుగా ఎల్ల బోయిన బిక్షపతి, మహేష్ కంచర్ల సోమయ్య కెమిటిమహేష్, జంపన్న, అంజయ్య, ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు జిగర్ యాదగిరి మరాటి మల్లేష్, దూదిమెట్ల సోమలింగం, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు

**చౌటుప్పల్, విశాలభారతి:**



పట్టణ కేంద్రంలోని 18 వార్డులో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం స్థానిక వార్డు మాజీ కౌన్సిలర్ కామిశెట్టి శైలజ భాస్కర్ మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ చేతులు మీదగా సీఎం సహాయ నిధి చెక్కు 38000 రూపాయలు బాధిత కుటుంబ సభ్యులు కూసుకుంట్ల మల్లారెడ్డికి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం వెంకటేశం,కాసోజు లింగా చారి, తడక అమర్,వల్లందాస్ యోగేష్, ఓర్సు రాజు, తదితరులు పాల్గొన్నారు.



# యాచారంలో రైతు భరోసా సంబరాలు

### సిఎం ఫోటోకు పాలాభిషేకాలు

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

వానాకాలం పంటల సాగు కోసం రైతుభరోసా నిధులు విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో 'రైతు పండుగ' సంబరాలు యాచారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కాంగ్రెస్ నేతలు సిఎం రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లుబట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫోటోలకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. 70 లక్షల మంది రైతులకు 9 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా వానాకాలం పంటకు సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్ లలో జమ చేశారని అన్నారు. ఎలాంటి పరిమితులు, షరతులు విధించకుండా వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న మొత్తం విస్తీర్ణానికి పెట్టుబడి సాయం అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లిక్కి పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, గడ్డమల్లాయ్య గూడ మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, ముచ్చర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ మెన్ సెంట్రల్ ఇండియా రీజియన్ నూతన కమిటీ ఎన్నిక

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**



వైజ్ మెన్ క్లబ్ సెంట్రల్ ఇండియా రీజియన్ డైరెక్టర్ గా ప్రముఖ న్యాయవాది ఎస్ రాజశేఖర్ రావు,రీజినల్ సెక్రటరీగా ప్రముఖ జర్నలిస్ట్ నేత ఎండి సలీమ్ పాషాలు ఎన్నికయ్యారు. హైదరాబాద్ లోని ద సెయింట్ హొటల్ లో జరిగిన కన్వెన్షన్ లో 2025-26 కు సంభందించిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైజ్ మెన్ క్లబ్ ఇండియా ఏరియా అధ్యక్షులు రాధాకృష్ణన్ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ సమావేశంలో పి ఆర్ డి ఓ శ్రీనివాస్ రెడ్డి రిసెప్షన్ కమిటీ చైర్మన్ గా,పిఆర్డీ లు అట్లూరి రామకృష్ణ, ఖలేబ్,సర్వేశ్వర్ రావు లు ఎన్నికల అధికారులు గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన బాడీతో పాటు ఎలెక్ట్ ఆర్డీ గా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రీజనల్ డైరెక్టర్ రాజశేఖర్ రావు,రీజనల్ సెక్రటరీ ఎం డి సలీమ్ పాషా లు మాట్లాడుతూ ఈ నెల 29 న కొచ్చి లో జరిగే ఇండియా కన్వెన్షన్ కి పెద్ద ఎత్తున తరలివెళు ్తన్నట్లు,విజయవంతం చేయాలని కోరారు. తమ పదవి కాలంలో వైజ్ మెన్ కార్యకలాపాలను ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నందుకు ఇండియా ఏరియా అధ్యక్షులు రాధాకృష్ణన్,పిఆర్డీలు ఓ ఎస్ రెడ్డి,అట్లూరి రామకృష్ణ,సర్వేశ్వర్ రావు,ఖాలేబ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
గురువారం
26.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## నూతన సీఐకి శుభాకాంక్షలు వెల్లువ



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సీఐకి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ మాట్లాడుతూ మండలంలో కొంతమంది యువత మద్యం , మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, చేడు మార్గం నుంచి మంచి మార్గానికి వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగు భరత్ రెడీ, శేఖర్, లింగం, బోడ విజయ్, కోడూరి పాండు, ప్రభు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ పై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

### జర్నలిస్ట్ పై దాడిని వ్యతిరేకిస్తూ వాజేడు మండల విలేకరులు నిరసన కార్యక్రమం

**వాజేడు, విశాలభారతి:**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కేంద్రంలో విలేఖరి పై కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు అర్ధరాత్రి దాడి చేసిన సంఘటన పై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాజేడు మండల కేంద్రంలో జర్నలిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎస్కే దావూద్ మాట్లాడుతూ.. తాడ్వాయి మండలంలో జర్నలిస్టు పై దాడి చేయడం చాలా బాధాకరమని, విలేఖరి పై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వాజేడు మండల జర్నలిస్ట్ అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాజేడు మండల జర్నలిస్ట్ అధ్యక్షులు అరికెళ్ల వేణు, ప్రధాన కార్యదర్శి సతీష్, గార నరసింహారావు, వరప్రసాద్, గంట సర్వేశ్వరరావు, సంతోష్, సమ్మయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## చెరుకూరు గ్రామంలో విషాదం

**వాజేడు, విశాలభారతి:**

విద్యుత్ ఘాతానికి గురై ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చెరుకూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు నాలుగు పశువులు మృతి చెందిన సంఘటన చెరుకూరు గ్రామపంచాయతీ మోత్కుల గూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బండి రాజమ్మ 65 సంవత్సరాలు సొంత పొలంలో ఉన్నటువంటి చింత చెట్టును నరుకుతున్న సందర్భంలో చింతచెట్టు కొమ్మ ఇరిగి త్రీఫేస్ లైన్ విద్యుత్ తీగలపై పడిపోవడంతో పక్కనే ఉన్న రాజమ్మ మరియు నాలుగు పశువులు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి ఈ సంఘటన తెలుసుకున్న గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ను నిలిపివేశారు. పాయం పాపారావు 1 పశువు,వాసం శ్రీనివాస్ కు చెందిన 1 పశువు, పీర్ల రామస్వామి కు చెందిన1ఆవు 1దూడ మృతి చెందినట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి వాజేడు సెకండ్ ఎస్సై కాంతారావు చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



## కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం

**మియాపూర్, విశాలభారతి:**

డివిజన్ పరిధిలోని శ్రీరంగపురం కాలనీ వాసులు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ను బుధవారం కలిసి సమ స్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పలు సమస్యలు,చేపట్టవలసిన అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. సందర్భంగా కార్పొ ‌రేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మియాపూర్ డివి జన్ పరిధిలోని శ్రీరంగాపురం కాలనీ వాసులు తనదృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి,పీఏసీ చైర్మెన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సహకారంతో కాలనీలో నెలకొన్న వివిధ సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. అలాగే కాలనీలో అసం పూర్తిగా మిగిలి పోయిన యూజీడీ పనులను, సీసీరోడ్ల నిర్మాణ పనులను త్వరి తగతిన పూర్తిచేస్తామని, మంజీర తాగునీటి వసతిని మెరుగుపరుస్తామని తెలిపారు. శ్రీరంగా పురం కాలనీలో సకాలంలో అన్ని పనులు పూర్తి చేసి కాలనీలో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు. మియా ఓపూర్ డివిజన్ ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. ఎలాంటి సమ స్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలని, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శ్రీరంగాపురం కాలనీవాసులు కేశవరావు, సుబ్బారావు, రామకృష్ణ, ప్రసాద్, గంగరాజు, మూర్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.



## పేద బిడ్డల విద్యాభివృద్ధికి పాటుపడాలి

**తొర్రూరు, విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద బిడ్డల విద్యాభివృద్ధికి పాటుపడాలని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు.తొర్రూరు డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్ లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 10 వేల పలకలు పంపిణీ చేసిన అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఝాన్సీ రెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల బాగు కోసం వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పేద బిడ్డలను ఉన్నతులుగా మార్చేందుకు వందేమాతరం చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న విద్యా సేవా కార్యక్రమాలు ప్రభుత్వానికి ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద బిడ్డల అభివృద్ధికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. విద్యారంగంపై ప్రభుత్వానికి ప్రత్యేక విజన్ ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతున్న వందేమాతరం ఫౌండేషన్ కు హెచ్ఆర్ జెఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.1 లక్ష తక్షణ విరాళం,తొర్రూరు మాజీ సర్పంచ్,నాన్న పెద్దనాన్న పౌండేషన్ చైర్మన్ ధరావత్ రాజేష్ నాయక్ రూ.20 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీంద్ర, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పోనుగోటి సర్వేశ్వరరావు, పెదగాని సోమయ్య,చాపల బాపు రెడ్డి, ధరావత్ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం అమలు చేయండి

### సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్




**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రాష్ట్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకొని, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రిచాలని, విద్యా హక్కు చట్టం తక్షణమే అమలు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుసింద్ర రావ్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులతోపాటు డొనేషన్లు, వార్షిక ఫీజులు, స్కూల్ డ్రెస్లు, పుస్తకాలు వంటివి బలవంతంగా అంటగట్టి దోపిడీకి గురిచేస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులపై మోయలేని తీవ్ర ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. సకాలంలో ఫీజులు చెల్లించ లేకపోతే స్కూళ్ల నుంచి వెళ్లగొట్టడం, హాల్ టికెట్లు, టీసీలు ఇవ్వక పోవడం వంటి దుర్మార్గపు చర్యల కు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్పడు తున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల పరి రక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యా హక్కు చట్టం సమర్థవంతంగా ఎందుకు అమలు చేయడంలేదని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించాలని, విద్య హక్కు చట్టం అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్ దిలీప్ రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోల, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వంటెపాక శ్రవణ్ కుమార్,రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మల్లం శ్రీనివాస్, ముచర్ల మల్లేశ్, రంగారెడ్డి జిల్లా కార్యని ర్వాహక అధ్య క్షులు రామగళ్ల శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు మాధగోని సత్యం, ప్రవీణ్, మహబూబ్నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బిపిజె శ్రీధరన్ తదితరులు పాల్గొన్నారు.

## విధ్వంసం నుంచి వికాసం మహేశన్న మనోగతం

**హైదరాబాద్, విశాలభారతి:**






బ్రిటిషోడు ఈ దేశాన్ని మొత్తం ఊడ్చుకపోయినంక, పేదోళ్లకు పట్టెడన్నం పెట్టింది కాంగ్రెస్ పార్టీయే గాంధీ, నెహ్రూ కుటుంబమే. అసలు ఈ దేశంలో సంక్షేమం అంటే ఫస్టు మనకు యాదికొచ్చేది కాంగ్రెసే. మొన్నటి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గెలిపించింది కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారెంటీలను నమ్మే. ఎందుకంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రమే చెబితే పక్కాగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని. మన నాయకుడు రేవంతన్న, మహేశన్నల నాయకత్వంలో ఒక్కొక్క హామీ చేసుకుంటూ ముందుకు కదులుతున్నం. ఇక ఇటీవల తెలంగాణలో జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ నాయకుల మాటలు, స్పందనలు చూస్తే చాలా హాస్యాదంగా అనిపిస్తున్నాయి. వారి వ్యాఖ్యలు, స్పందనలను చూస్తుంటే నాకు ఒక విషయం గుర్తుకు వస్తున్నది. ఒక నక్క ప్రమాణం చేసిందట,ఇంకెవరిని వంచించనని. ఒకపాము శివుడిపై ఒట్టేసిందట ఇంకెవరిని కాటు వేసి చంపనని. ఒక రాబంధు మాట ఇచ్చిందట, ఇంకెప్పుడూ చచ్చిన పశువులను పీక్కు తిననని. ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిదట... తోటి జంతువులను సంహారించనని. ఈ కట్టుకథలు కల్వకుంట్ల కుట్రలను మన తెలంగాణ రాష్ట్ర ప్రజలు వినాలా? విని నమ్మాలా? గత పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్ నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే, విషపురుగులై విషసర్పాలై, రాబంధులై ఉద్వేగం పేరుతో మనల్ని ఉన్మాదులను చేసే కుట్రకు పాల్పడుతుండటం బాధా కరం. కేసీఆర్ కుటుంబంలో గొడవలతో బీఆర్ఎస్ నాయ కులకు ఏం మాట్లాడాలో.... ఏ విధంగా స్పందించాలో అర్థం కావడం లేనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వాళ్ళు దొంగలకే... దొంగలు... మోసగాళ్లకే మోసగాళ్లు అన్నది జగమెరిగిన సత్యం. ఈ అంశాలన్నింటినీ పీసీసీ చీఫ్ మహేశన్న పుస్తకం ఆవిష్కరించింది. మనోవికాసం పొందాలనుకున్న ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం విధ్వంసం నుంచి వికాసం.

## కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:**



తొర్రూరు వంటి ప్రాంతాలలో అందుబాటులో ఉన్న కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు,కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి కోరారు.తొర్రూరు పట్టణ కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ లైఫ్ లైన్ క్రిటికల్ కేర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను డిఎంహెచ్ఓ భూక్య రవి రాథోడ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, డివిజన్ చుట్టూ పరిసరాల ప్రాంత ప్రజలు సుధీర ప్రాంతాలకు వెళ్లకుండా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని షుగర్, బిపి, ఛాతి, గుండె నొప్పి, కామెర్లు, లివర్ సమస్యలు, టైఫాడ్, మలేరియా,పేలేరియా,విష జ్వరము,పిడ్స్, పక్షవాతం, తలనొప్పి, మెడ,నడుమ నొప్పి, నరాల వ్యాధులు,దగ్గు,దమ్ము, ఆయాసం, ఎలర్జీ, కీళ్ల, మోకాళ్ళ తదితర వ్యాధులకు సేవలు ప్రారంభించడం అభినందనీయమన్నారు.వైద్య సేవలు పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ గుగులోత్ సురేష్ నాయక్,డాక్టర్ రాజేందర్ రెడ్డి,డాక్టర్ యాదగిరి రెడ్డి,డాక్టర్ కిరణ్ కుమార్,డాక్టర్ రాం నర్సయ్య,డాక్టర్ స్వరూప్ కుమార్, డాక్టర్ రాజు,కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి,పెదగాని సోమయ్య,చాపల బాపురెడ్డి, పింగిలి ఉష,చెవిటి సధాకర్,పేరటి యాకూబ్ రెడ్డి,మంగళపల్లి రామచంద్రయ్య,జీనుగా సురేందర్, వై. శ్రీనివాస్,దీకొండ మధు, వెలుగు మహేశ్వరి, బాలకృష్ణ, బాణోత్ వీరన్న నాయక్, బుజ్జి కిషన్ నాయక్, రాజేష్ యాదవ్, అభిరాం నాయక్,మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కూతురి చేతిలో హత్యకు గురైన అంజలికి నివాళి



**మహబూబాబాద్:** కూతురి చేతిలో హత్యకు గురైన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారిణి అంజలి మృతదేహానికి సాంస్కృతిక శాఖ కళాకారులు,డీపీఆర్ఓ రాజేందర్ ప్రసాద్ నివాళ్ళు ఆర్పించారు. స్వగ్రామం ఇనుగుర్తి గ్రామంలో అంజలి అంతిమయాత్రలో కళాకారులు, జేఏసీ నాయకులు, కుల సంఘాలనాయకులు పాల్గొన్నారు. తక్షణ సహాయం కింద పదివేల రూపాయలను అంజలి కుటుంబ సభ్యులకు డీపీఆరోఓ రాజేందర్ ప్రసాద్ అందచేశారు .. అంజలి మృతదేహానికి నివాళులు అర్పించారు మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్. అంజలి చిన్న కూతురు మనస్విని మాట్లాడుతూ అమ్మను చంపిన ఆ ముగ్గురిని వదలొద్దని ఉరితీయాలని ప్రభుత్వాన్ని కోరింది. అమ్మను చంపిన మా అక్క..శివ, వాళ్ళ తమ్ముడికి ఊరి శిక్షపడాలి.. మాకు న్యాయం చేయాలి.. మా కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలి.. సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు సీతక్క, కొండా సురేఖకు దండంపెడుతున్న.. ఆ ముగ్గురిని వదలొద్దని వేడుకుంది. పోలీసులు కస్టడీలో ఉన్న శివను వదిలేయడం వల్లనే శివ బయటకు వచ్చి అమ్మను చంపాడని మనస్విని అరోపించింది. సాంస్కృతికశాఖ కళాకారులు గిద్దె రామనర్సయ్య మాట్లాడుతూ.. హత్యకు గురైన అంజలి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలి.. అంజలి చిన్న కూతురు మనస్వినిని ప్రభుత్వమే చదివించి..ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.. అంజలి కుటుంబానికి సాంస్కృతికశాఖ కళాకారుల తరపున తరుపున..5 లక్షల రూపాయల ఇస్తున్నామని తెలిపారు. అంజలిని హత్య చేసిన ముగ్గురిని వదిలి పెట్టవద్దన్నారు. అంజలి కుటుంబాన్ని రేవంత్ సర్కార్ అదుకోవాలని కోరారు.